క్లుప్తంగా

దళారులతో మోసపోవద్దు

హుజూరాబాద్: కార్మికులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కార్మికశాఖ అధికారి చందన అన్నారు. గురువారం పట్టణంలోని కార్మికశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్మికుడు రిజిస్ట్రేషన్ ఫామ్ లేబర్ కార్డు కొత్తదాని కోసం సహాయ కార్మిక అధికారి కార్యాలయానికి వచ్చి స్వయంగా దరఖాస్తు ఫారం ఇచ్చి రిజిస్టర్‌లో సంతకం చేయాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు అందాలంటే కార్డు కోసం నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, కార్డులున్నవారు సమయానికి రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

వ్యవసాయ మోటారు చోరీ

శంకరపట్నం: మండలంలోని అర్కండ్లవాగులో బిగించిన వ్యవసాయ మోటారు చోరీకి గురైంది. వాగు పక్కన భూములు ఉన్న రైతులు వాగులో విద్యుత్‌మోటార్లు బిగించుకుని పంటలు సాగుచేస్తుంటారు. నేదురు సమ్మయ్య మోటార్‌ను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గురువారం తెల్లవారుజామున మోటార్ కనిపించకపోవడంతో కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.

చెట్ల నరికివేతపై ఎంపీవో విచారణ

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ చెరువులో తుమ్మచెట్ల నరికివేతపై గురువారం ఎంపీవో బషీరొద్దీన్ విచారణ చేశారు. అనుమతులు లేకుండా మాజీ సర్పంచ్ రాజయ్య తుమ్మ చెట్లను అక్రమంగా నరికివేశారని యుగేందర్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని నివేదికను డీపీవోకు అందిస్తామని ఎంపీవో పేర్కొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీఎంహెచ్‌వో సుజాతకు ఏప్రిల్ 25 తేదీన ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పట్టణానికి చెందిన రచ్చ రవికృష్ణ గురువారం ప్రకటనలో ఆరోపించారు. థైరాయిడ్ టెస్ట్ కోసం తన భార్య రక్త నమూనాలు తీసుకొని రిపోర్టులు ఇవ్వకుండా పోయాయని చెబుతూ మళ్లీ రక్త నమూనాలివ్వాలనడంతో ఫిర్యాదు చేయగా డీఎంహెచ్‌వో ఆసుపత్రి నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్నారని పలుమార్లు అడినప్పటికీ చర్యలు తీసుకుంటామని దాటవేస్తున్నారని, న్యాయం కోసం రాష్ట్ర వైద్యశాఖ అధికారులు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నాడు.

పిడుగుపాటుతో పశువులు మృతి

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో కట్ట ఈశ్వరమ్మకు చెందిన గేదె పిడుగుపాటుతో గురువారం మృతి చెందింది. ఇంటి సమీపంలోని చెట్టుకు కట్టేసిన గేదెపై సాయంత్రం పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందిందని, గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన సేనారెడ్డి, మాణిక్యంకు చెందిన రెండు పాడి పశువులు పిడుగుపాటుతో మృతి చెందాయి. పశువుల విలువ రూ. లక్ష ఉంటుందని రైతులు వాపోయారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్రగాయాలు

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లి గ్రామానికి చెందిన రైతు మొలుగూరి పోచయ్యకు గురువారం విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఉదయం నారుమడికి నీరు పెట్టడానికి వచ్చిన పోచయ్య కరెంట్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లను సరి చేస్తుండగా షాక్ తగిలింది. చికిత్స కోసం 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించామన్నారు.

11న వేలం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామం మత్స్యగిరీంద్ర స్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమి కౌలుకు వేలం వేయనున్నట్లు ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఆలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనే రైతులు రూ.10వేలు దరావత్తు చెల్లించాలని సూచించారు. వేలం దక్కించుకున్నవారు ఆలయానికి చెందిన 38 గుంటల భూమిని ఈ నెల12 నుంచి 2025 జూన్ 31వరకు సాగు చేసుకోవాలన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ఐదెకరాల్లోపు భూమి, బోరుబావి, విద్యుత్ కనెక్షన్, జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో భీమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, ఊతకర్రలు కట్టడం, మొక్కల కొనుగోలు, ఎరువులు వేయడం, పర్యవేక్షణకు మూడేళ్ల పాటు ఉద్యానశాఖ, మైక్రో ఇరిగేషన్ ద్వారా వందశాతం ఉపాధి పథకం డబ్బులు చెల్లిస్తారని తెలిపారు. రైతులు ఆయా జీపీ కార్యదర్శులు, ఏఈవో, ఏపీఓ (ఈజీఎస్) అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పప్పుదినుసుల సాగు తగ్గుతోంది

- ఏటా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- పెరగని పంట సాగు విస్తీర్ణం
- రోజురోజుకు పెరుగుతున్న ధరలు


గంగాధరలో సాగుచేసిన పెసర పంట (ఫైల్)

సంవత్సరం	కంది	పెసర(ఎకరాల్లో)
2021	958	78
2022	412	17
2023	455	000
2024	000	000

గంగాధర: పప్పుదినుసుల సాగుపై ఏటా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా పంటలు మాత్రం సాగుకు నోచుకోవడం లేదు. సాగు విస్తీర్ణం క్రమేపి తగ్గుతూ వస్తోంది. ఈ వానాకాలం ఆరంభం నుంచే రైతులు పప్పుదినుసుల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గతేడాది కందులకు బహిరంగ మార్కెట్‌లో ధర బాగా పలికినా రైతులు వాటిసాగు ఊసెత్తడంలేదు. గతంలో వరదకాలువ నీటితో పాటు, నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా చెరువులు కుంటల్లోకి నీరు రావడంతో పాటు భూగర్భ జలాలు పెరగడంతో రైతులు వరి పండించడానికి ఆసక్తి చూపారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో చుక్కా నీరు లేదు. వరదకాలువ, నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీరు వచ్చే అవకాశం లేదు. అయినా రైతులు పప్పుదినుసులు పండించడానికి విముఖత చూపుతున్నారు.

సాగుపై రైతుల అనాసక్తి..

మెట్టప్రాంత మండలాల్లో ఒకప్పుడు ప్రతిరైతు పంటపొలంలో కొంత మేర పప్పుదినుసుల(అపరాలు) సాగు చేసేవారు. ప్రస్తుతం వాణిజ్య పంట పత్తితో పాటు వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో కంది, పెసర, శనగ వంటి పప్పు దినుసుల పండించడం తగ్గిపోతోంది. సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు దిగుబడి తగ్గి పప్పుదినుసుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గతంలో రైతులు పునాసలో (ఖరీఫ్‌లో) సాగు చేసే పెసర పంటను రెండు విధాలుగా వినియోగించు కునేవారు. ఖరీఫ్ ఆరంభంలోనే వరి సాగు చేసే నేలల్లో పెసర పంట సాగు చేసేవారు. పెసర పంట చేతికందే సమయానికి విరివిగా వర్షాలు కురిసేవి. రైతులు పెసర కాయలు తీసుకున్న తరువాత అదే చేనును వరి సాగుకు దున్నేవారు. దీంతో కాయ తీసుకున్న పెసర చేను పొలంలోనే మురగడంతో సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడేది. కంది,శనగ పంటచేనులు రెండు విధాలుగా ఉపయోగ పడేవి. కందిచేను చేతికందిన తరువాత కందిపొరక వంట చెరుకుగా ఉపయోగపడేది. శనగ పంట చేతికందిన తరువాత శనగ పొట్టు పశువుల దాణాగా ఉపయోగపడేది. ప్రస్తుతం పప్పుదినుసుల సాగు అంతంత మాత్రమే ఉంది. రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నా, మద్దతు ధర పెంచుతున్నా రైతులు ఆసక్తి చూపడంలేదు. మండలంలో అపరాల సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఆరుతడి పంటలతో పాటు పప్పు దినుసుల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు దిగుబడి, మద్దతు ధర తదితర విషయాలను వివరిస్తున్నాం. పంటల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి అధికంగా వస్తుందని రైతులకు తెలియజేస్తున్నాం.

– రాజు, వ్యవసాయాధికారి, గంగాధర

వ్యవసాయశాఖ అధికారుల సమాచారం ప్రకారం 2021 వానాకాలంలో పెసర 78, కంది 958 ఎకరాల్లో సాగు చేశారు. 2022లో కంది 412, పెసర 17 ఎకరాల్లో సాగు చేశారు. 2023లో 455 ఎకరాల్లో కంది సాగు చేసారు. ప్రస్తుతం ఇప్పటివరకు కంది, పెసర సాగు నోచుకోలేదు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


రామడుగు: గోపాల్‌రావుపేటలో బడిబాటలో ఎంఈవో వేణుకుమార్


ఇల్లందకుంటలో...

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు ఏమేరకూ పూర్తయ్యాయని తెలుసుకున్నారు. మనఊరు మనబడి పనులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు దుస్తులు, బుక్స్, మధ్యాహ్న భోజన వసతిని తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదనాచారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

వీణవంక : మండలంలోని రెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, కిష్టంపేట గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి డీఈవో జనార్దన్‌రావు పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో విద్యపు శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సంపత్‌కుమార్‌చారి, అసిస్టెంట్ ఇంజినీర్ మీస రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రాజగోపాల్‌రెడ్డి ,నాగిరెడ్డి, వీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరుతూ బడిబాట కరపత్రాలను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంబటి వేణుకుమార్, ఉపాధ్యాయులు అవధూత శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: గ్రామాల్లోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మనపల్లిలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ రావ్, ఎంపీటీసీ మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఇల్లందకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు పిల్లలను సర్కారు స్కూళ్ల చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఇల్లందకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.సాంబయ్య అన్నారు. ఇల్లందకుంటలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయులు గ్రామ యువత, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో బోధన, అన్ని వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు జయప్రకాశ్, వేణు, సత్యం, సమ్మిరెడ్డి, మల్లయ్య, అన్నపూర్ణ, శ్రీదేవి, నాగరాజు, మారుతి, శంకర్, రాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి, సంపత్, వీరాస్వామి పాల్గొన్నారు.


రామడుగు: రంగసాయిపల్లిలో బడిబాట


చిగురుమామిడి: బొమ్మనపల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

'ఎమ్మెల్యే సర్పంచ్‌లా వ్యవహరించడం సరికాదు'


మాట్లాడుతున్న పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో హుజూరాబాద్ ప్రజలు బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతను ఓటు ద్వారా తెలియజేస్తే దాన్ని వక్రీకరిస్తూ విమర్శలకు దిగటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సర్పంచ్‌లా వ్యవహరించడం సరికాదని అసెంబ్లీ ఎన్నికల్లో సెంటిమెంట్‌తో గెలిచారు తప్పా నిజమైన గెలుపు కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో దేవుడి పేరు చెప్పుకొని తిరిగిన బీజేపీ నాయకులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు బాబు, కిరణ్, వేముల పుష్పలత, సుశీల, ఎర్ర రమేష్, మహేశ్వరి, అప్సర్, రామారావు, సుంకరి రమేష్, కుర్ర శ్రీనివాస్, వినోద్, సూర్య, అనిల్, దీక్షిత్, సతీష్‌రెడ్డి, లింగారావు తదితరులు ఉన్నారు.

'ఓటమికి ఎమ్మెల్యే బాధ్యత వహించాలి'

కరీంనగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నైతిక బాధ్యత వహించాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి గోష్కి శంకర్, నాయకులు కొయ్యడ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కమలాకర్ దళిత, ముస్లింలకు ఎలాంటి పనిచేయలేదని, తన సామాజిక వర్గానికి మాత్రమే లబ్ధిచేసినట్లు తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో దళితులను నిర్లక్ష్యం చేయడంతోనే బీఆర్‌ఎస్ ఓటమి చెందిందని అన్నారు. వినోద్‌కుమార్ ఓటమికి కారణమైన కమలాకర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి


మాట్లాడుతున్న పెంట అజయ్

కరీంనగర్: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పెంట అజయ్ డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలిపారు. డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అన్నారు. బీసీ వసతి గృహ ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను ప్రస్తుతం ధరలకు అనుకూలంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి వికాస్, గరిగే కోటేశ్వర్, కాల్వ కిషన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఒంటెద్దు పోకడలకు గుణపాఠం'

కరీంనగర్: దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు బీజేపీ ఒంటెద్దు పోకడలకు తగిన గుణపాఠం చెప్పారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటరిగానే 400 సీట్లు సాధిస్తామని తద్వారా రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లను సవరిస్తామని పగటి కలలు కన్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 303 సీట్లు సాధించిన బీజేపీ నేడు 241కి పరిమితమైందని అన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిని ఆదరించి ఎక్కువ సీట్లు ఇచ్చారని, దీనిమూలంగా దేశంలో బలమైన ప్రతిపక్షం ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వామపక్షాల బలం పుంజుకుందని రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా ఐక్య ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు.

నర్సరీల తనిఖీ


నర్సరీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి స్వాతి, ఎస్సై, ఏవో

తిమ్మాపూర్: మండలంలోని కూరగాయల నర్సరీలను మానకొండూర్ ఉద్యానశాఖ అధికారి స్వాతి గురువారం తనిఖీ చేశారు. లైసెన్స్ పొందని నర్సరీల నిర్వాహకులు నాలుగు రోజుల్లో ఉద్యనశాఖ ద్వారా లైసెన్స్ పొందాలని, అవసరమైన దరఖాస్తులు సమర్పించాలని ఆదేశించారు. నర్సరీ చట్టం ప్రకారం కూరగాయల నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి అని, లైసెన్స్ పొందకుండా నర్సరీ నిర్వహిస్తే రూ.50 వేల వరకు జరిమానాతోపాటు జైలుశిక్ష రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు. వెంట ఎల్ఎండీ ఎస్సై చేరాలు, తిమ్మాపూర్ వ్యవసాయాధికారి సురేందర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నాయకుల ఫిర్యాదు


హుజూరాబాద్: ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

హుజూరాబాద్: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో బుక్స్ స్టాల్స్ ఏర్పాటు చేసి అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో కేతిరి వెంకట నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే ఎక్కువ ధరలకు యాజమాన్యాలు పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అభిలాష్, శివ తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట తహసీల్దార్ విజయ, ఎంఈవో విద్యపు శ్రీనివాస్‌కు ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు పాఠశాలలు అధిక మొత్తంలో అమ్మకాలు సాగిస్తున్నారని, ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోకుంటే ఎన్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అభిలాష్, శివతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న కూలీలు


ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కర్

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి ఊర చెరువు నుంచి మట్టి తరలింపును గురువారం ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు అడ్డుకున్నారు. రైల్వే కాంట్రాక్టర్ అక్రమంగా మట్టి తీసుకెళ్తున్నాడని, తాము ఉపాధి కోల్పోతామని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న రామడుగు తహసీల్దార్ భాస్కర్, ఎస్సై సురేందర్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులు, కూలీలతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌కు అన్ని విధాలా ప్రభుత్వ అనుమతులున్నాయని, ఎవరు అడ్డుకోవద్దని అన్నారు. లేదంటే చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామనడంతో ఆందోళన విరమించారు.

10న ఉపాధి హామీ రాష్ట్ర సదస్సు


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాయికంటి శ్రీనివాస్

మానకొండూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 10న నిర్వహించే ఉపాధిహామీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అన్నారంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గిట్టుబాటు కూలీ, సమయానికి డబ్బులు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

భగీరథ పైపులైన్ ధ్వంసం


ధ్వంసమైన భగీరథ పైపులైన్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. స్థానికుల కథనం ప్రకారం .. జెడ్పీ పాఠశాలలోని వాటర్‌ట్యాంకు నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయానికి రాజీవ్ రహదారి వెంట మిషన్ భగీరథ పైపులైన్ వేశారు. అయితే వారం రోజుల నుంచి ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో భాగంగా రాజీవ్ రహదారి పక్క నుంచి పైపులైన్ వేసేందుకు జేసీబీతో కందకం తవ్వుతున్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం జెడ్పీ పాఠశాల సమీపంలో కందకం తవ్వుతుండగా భగీరథ పైపులైన్‌కు జేసీబీ బకెట్ తగలడంతో పలు చోట్ల పైపు ధ్వంసమైంది. దీంతో డబుల్‌బెడ్రూం ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. గురువారం పంచాయతీ సిబ్బంది పైపులైన్ మరమ్మతు చేపట్టినప్పటికీ పనులు పూర్తికాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీవాసులు కోరుతున్నారు.

కాల్వ నర్సయ్యకు నివాళి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో గురువారం దివంగత సీపీఐ, యాదవ సంఘం నాయకుడు కాల్వ నర్సయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్‌లోని గొర్రెల పెంపకందారుల సంఘం ఆవరణలోని కాల్వ నర్సయ్య విగ్రహానికి పలువురు యాదవ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ నాయకుడిగా, యాదవ సంఘం నాయకుడిగా నర్సయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీందర్, మల్లేశం, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అశోక్, రాజు, రాజ్‌కుమార్, రవి, భూమిరెడ్డి పాల్గొన్నారు.